# ఇంతకన్న మంచిగ ఎవలు అరుసుకుంటరు!

## సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం భేష్

రుచి అమోఘమంటున్న విద్యార్థులు

హాజరుశాతం పెరుగుతుందంటున్న టీచర్లు

పేదల మనసెరిగిన నాయకుడు కేసీఆర్

రుణపడి ఉంటామంటున్న తల్లిదండ్రులు

ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల పక్షపాతి అని మరోమారు రుజువైంది. సర్కారు బడుల్లో చదివే పిల్లలు దాదాపుగా నిరుపేద కుటుంబాలకు చెందినవారే. వారికి బ్రేక్‌ఫాస్ట్ అంటే ఏంటో తెలియదు. కాలేకడుపుతోనే పాఠాలు వింటున్న పిల్లలు ఎంతోమంది. కండ్లు నులుముకుని కూలికెళ్తే కానీ పొయ్యి వెలగని నిరుపేదలు అంత ఉదయాన్నే పిల్లల కడుపెలా నింపగలరు. భావిభారతావనికి చుక్కానిలా నిలవాల్సిన పిల్లలు ఇలా పస్తులతో పాఠాలు వినకూడదన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించినదే 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం'.

రోజుకో రుచికరమైన టిఫిన్.. అది కూడా బలవర్ధకమైనది. ఓ రోజు ఇడ్లీ సాంబార్ అయితే, మరో రోజు పూరీ.. ఆలూకుర్మా. మరోరోజు మిల్లెట్ ఇడ్లీ.. ఇలా వారం రోజులు రోజుకో రకం అల్పాహారం అందించే పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారు. ఇది పిల్లల కడుపునింపడమే కాదు.. పేదల మన్ననలు కూడా అందుకుంటున్నది. పిల్లలు తినకుండా బడికి వెళ్లారన్న రందిని తమ నుంచి దూరం చేసిన సీఎం కేసీఆర్‌కు తాము రుణపడి ఉంటామని తల్లిదండ్రులు వేనోళ్ల పొగుడుతున్నారు. ఇప్పటికే సర్కారు స్కూళ్లలో కార్పొరేట్ విద్యను అందిస్తున్న కేసీఆర్ సర్కార్ దేశంలోనే మరెక్కడా లేని ఈ అల్పాహార పథకం ప్రారంభించి ఆదర్శంగా నిలిచింది. – నమస్తే తెలంగాణ నెట్‌వర్క్



### ఇడ్లీ సాంబార్ సూపర్‌గా ఉంది



సీఎం అల్పాహారం కార్యక్రమంలో భాగంగా ఉదయం మా స్కూల్‌లో వడ్డించిన ఇడ్లీ సాంబార్, చట్నీ చాలా బాగుంది. మా ఇంట్లో అమ్మ చేసిన టిఫిన్‌లాగే రుచి అద్భుతంగా ఉంది. మా స్కూల్‌లో ప్రతి రోజూ ఇలానే రోజుకో రకంగా టిఫిన్స్ పెడతామని టీచర్లు చెప్తున్నరు. మా స్కూల్‌కు ఇంటి నుంచి నడుచుకుంట రావడానికి దాదాపు 20 నిమిషాల సమయం పడుతుంది. నేను ఉదయం లేచి తయారయ్యేసరికే స్కూల్ టైం అయ్యేది. అంత ఉదయం ఇంటి దగ్గర తినడం నా వల్ల కాకపోయేది. ఇప్పుడు కేసీఆర్ సార్ తీసుకు వచ్చిన సీఎం బ్రేక్‌ఫాస్ట్‌తో మా ఆకలి తీరుతున్నది.

**- మిరిదొడ్డి తేజశ్రీ, 8వ తరగతి, నెహ్రూనగర్, సిరిసిల్ల**

### కేసీఆర్ సార్‌కి చేతులెత్తి మొక్కాలె

సర్కారు బళ్లనే ఇక నుంచి పిల్లలకు టిఫిన్ పెడుతరంట. నాకు ఒక్కడే కొడుకు. రోజూ స్కూలుకు పోతడు. ఇప్పుడు ఆరో తరగతి సదువుతున్నడు. పొద్దుగాల ఏం తినకుండా స్కూల్‌కి పోతే ఆకలితో ఎట్ల ఉంటడనే రంది ఉండే. ఇప్పుడు పొద్దుగాల కూడా స్కూళ్లనే టిఫిన్ పెడుతరంట. మధ్యాహ్నం అన్నం కూడా ఆడనే పెడుతున్నరు. మాలోంటి పేదోళ్ల కోసం సర్కారు మంచి నిర్ణయం తీసుకున్నది. ఇప్పడి సంది అందరి పిల్లలు కూడా ఇగ సర్కారు బడికే పంపుతరు. సీఎం కేసీఆర్ సారు మంచి నిర్ణయం తీసుకున్నరు. ఆయనకు చేతు లెత్తి మొక్కాలె.

**-తిమ్మక్క, దేగాం, భైంసా, నిర్మల్ జిల్లా**



### కేసీఆర్ సాబ్‌కు షుక్రియా



సుబాహ్ స్కూల్‌మే టిఫిన్ సిస్టం బహుత్ అచ్ఛాహై. యే సిస్టం హేలాన్ కరేసో సీఎంకో బహుత్ షుక్రియా. బ్రేక్‌ఫాస్ట్ పథకం తెచ్చిన సీఎం కేసీఆర్ సార్‌కు కృతజ్ఞతలు. ఉదయం ఇంటినుంచి ఏం తినకుండానే పాఠశాలకు వస్తుంటిమి. ఇలాంటి సమయాల్లో ఆకలితో పాఠాలు సమజ్ కాకపోయేటివి. రెండు రోజుల నుంచి ఇక్కడే టిఫిన్ పెడుతుండ్రు. మంచి టేస్ట్‌తోని చేస్తున్న టిఫిన్ బాగుంది.

**- ఒమేరాబేగం, విద్యార్థిని, గాంధీనగర్, బోధన్**

### సర్కారు రంది లేకుండా చేసింది



నా బిడ్డలిద్దరూ సూర్జపూర్‌లోని సర్కారు బడిలో చదువుతున్నరు. మొదటి బిడ్డ స్నేహిత నాలుగు, అకాంక్ష రెండో తరగతి. రోజూ పొద్దుగాల టిఫిన్ చేసి పెట్టాలంటే ఇబ్బందయ్యేది. చాయలో బిస్కెట్లు తిని బడికి పోయేటోళ్లు. అప్పుడప్పుడు అటుకులు, ఉప్మా టిఫిన్‌గా చేసి పెడుతుంటిని. పిల్లలు ఆకలికి ఎట్లుంటరో అని రంది ఉండే. ఇప్పుడు ఆ బెంగ పోయింది. ప్రభుత్వమే పొద్దున పిల్లలకు టిఫిన్ పెడతదని తెలిసింది. మేం పొద్దుగాల లేస్తనే కూలి పనులకు పోయేటోళ్లం. పిల్లగాండ్లకు పొద్దుగాల ఏదన్న చేద్దామంటే ఇబ్బందయ్యేది. ఇప్పుడు పొద్దుగాల టిఫిన్, పగటేళకు అన్నం అక్కడే పెడుతరు. మాలాంటి పేదోళ్ల ఇండ్లల్ల పొద్దుగాల టిఫిన్లంటే కొద్దిగా కష్టమే.

**-మోర్తాడి గోదావరి, సూర్జపూర్, నిర్మల్**

### విద్యార్థుల అటెండెన్స్ పెరుగుతుంది

సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం చాలా బాగుంది. బోధన్ నియోజకవర్గంలో తొలుత మా పాఠశాలలోనే దీన్ని ప్రారంభించారు. రెండు రోజులుగా విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల్లో కనీసం 40 శాతం మంది విద్యార్థులు ఇంట్లో ఎలాంటి ఆహారం తీసుకోకుండానే బడికి వస్తారు. ఇలాంటి వారికి బ్రేక్‌ఫాస్ట్ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మధ్యాహ్నం వరకు ఆకలితో అలమటించే విద్యార్థులు చదువుపై సరిగా దృష్టి సారించకలేకపోతున్నారు. ఇక నుంచి ఆ సమస్య ఉండదు. పైగా విద్యార్థుల అటెండెన్స్ కూడా పెరుగుతుంది.

**- మహమ్మద్ అబ్దుల్ వాహెద్, హెచ్‌ఎం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గాంధీనగర్, బోధన్**





### కేసీఆర్ ఒక్కరే అన్ని సౌలతులు మంచిగ చేస్తున్నరు

నా పిల్లలను చిన్నప్పటి సంది సర్కారు బళ్లనే చదివిపిస్తున్న. సర్కారు బళ్లో అన్నీ ఫ్రీగా ఇస్తున్నరు. పుస్తకాలు, స్కూల్ డ్రెస్సు, బువ్వ అన్ని మంచిగ ఇస్తున్నరు. ఇప్పుడు పొద్దుగాల టిఫిన్ పెడుతమని అంటున్నరు. ఇంతకన్న మంచిగ ఎవలు అరుసుకుంటరు. ఏ ప్రభుత్వం కూడా గిట్ల పేదోళ్ల గురించి ఆలోచించలె. సీఎం కేసీఆర్ ఒక్కరే అన్ని సౌలతులు మంచిగ చేస్తున్నరు. పిల్లలకు మధ్యాహ్న భోజనం కూడా మంచిగ పెడుతున్నరని పిల్లలు చెబుతున్నరు. వారానికి మూడు గుడ్లు, రాగి జావ.. ఇలా పౌష్టికాహారం ఇస్తున్నరు. ఇప్పుడు పొద్దుగాల టిఫిన్ కూడా పెడుతమని అంటున్నరు. చాలా సంతోషమనిపించింది.

**-శనిగారపు నాగలక్ష్మి, సూర్జపూర్, నిర్మల్**



రాధాకృష్ణుల ఆలయం శిలాఫలకం ఆవిష్కరణలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్. పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

## టెంపుల్ సిటీగా కరీంనగర్

- మంత్రి గంగుల కమలాకర్
- పర్యాటకంగా ఎంతో ప్రగతి : బోయినపల్లి వినోద్‌కుమార్

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 7: కరీంనగర్ జిల్లా కేంద్రం టెంపుల్ సిటీగా ఎంతో అభివృద్ధి చెందుతున్నదని, ఆధ్యాత్మికతలోనూ నగరం శాంతి, సౌభాగ్యాలతో విరాజిల్లుతున్నదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఎదురుగా నిర్మించనున్న రాధాకృష్ణుల ఆలయానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ వై సునీల్‌రావు, కలెక్టర్ డాక్టర్ గోపి, ఇస్కాన్ బాధ్యులు నరహరి ప్రభుతో కలిసి మంత్రి గంగుల శనివారం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఇప్పటికే శంకుచక్రాలతో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, తిరుమల తిరుపతి దేవస్థానం, రాధాశ్రీకృష్ణుల ఆలయం ఏర్పాటుతో కరీంనగర్ టెంపుల్ సిటీగా మారనున్నదని చెప్పారు. ఈ మందిరాన్ని మూడెకరాల స్థలంలో రూ.25 కోట్లతో నిర్మించనున్నట్టు తెలిపారు. ఈ నెల 6నే తిరుమల తిరుపతి దేవస్థానానికి టెండర్లు పూర్తయ్యాయని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వివరించారు. అనంతరం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఇస్కాన్ ఆధ్వర్యంలో కరీంనగర్ రివర్ ఫ్రంట్ సమీపంలో నిర్మిస్తున్న రాధాకృష్ణుల ఆలయంతో నగరం పర్యాటకంతోపాటు ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



శనివారం మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లిలో గోదామును ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ సర్కారే

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 7: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. హంగు వచ్చే సమస్యే లేదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని బాదేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.1.87 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన 2,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును శనివారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ అనుకూల విధానాలను అమలు చేయడం వల్ల సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో వేర్‌హౌస్ గోదాముల నిల్వ సామర్థ్యం కేవలం 4 లక్షల మెట్రిక్‌టన్నులు మాత్రమే ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి పెరిగిందని చెప్పారు. మార్కెటింగ్, వేర్‌హౌస్ కార్పొరేషన్ మాత్రమే కాకుండా సహకార సంఘాలు కూడా బలోపేతమైనట్టు మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

## పనిచేసే ప్రభుత్వాన్నే ఆదరించాలి

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- 1,434 మందికి గృహలక్ష్మి పత్రాలు



వర్నిలో గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో స్పీకర్ పోచారం

బాన్సువాడ రూరల్/ వర్ని, అక్టోబర్ 7 : దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాలే సర్కార్‌కు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. శనివారం ఆయన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తిర్మాలాపూర్‌లో రూ.2.53 కోట్ల అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లా వర్నిలోని సీసీడీలో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూరు, కోటగిరి, పొతంగల్ మండలాలకు చెందిన 1,434 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దూరదృష్టితో రూ.85 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. కాళేశ్వరం నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి తీసుకొచ్చి రెండు పంటలకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో సాగు నీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. పేదలకు విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందాలనే సంకల్పంతో బాన్సువాడ నియోజకవర్గంలో దవాఖానలు, గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కృషి చేసినట్టు చెప్పారు.




సూర్యాపేటలో బట్రాజుల కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

- కాంగ్రెస్, బీజేపీతో ఒరిగేదేమీ లేదు
- విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 7: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉన్నదని విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా పలు ఆత్మగౌరవ భవనాలకు శంకుస్థానలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణను సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లుగా ఎవరి ఊహలకందని రీతిలో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లోనూ మరిన్ని అద్భుతాలు సాధ్యమని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులతో కొత్తగా ఒరిగేదేమీ లేదనే విషయం ప్రజలందరికీ అర్థమైందని అన్నారు.

- కృష్ణమ్మ పరుగులు



'పాలమూరు-రంగారెడ్డి' మోటర్‌ను మూడోసారి ప్రారంభించారు. నాగర్ కర్నూల్ జిల్లా నార్లాపూర్ వద్ద పీఆర్ ఎల్ఐ మొదటి లిఫ్ట్‌లో పంప్‌ను శుక్రవారం రాత్రి ఆన్ చేయగా అంజనగిరి రిజర్వాయర్‌లోకి కృష్ణమ్మ పరుగులు పెట్టింది. - కొల్లాపూర్

## ఇంటింటికీ కేసీఆర్ సంక్షేమ పథకాలు

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 7: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని, పథకాలు ఇలాగే కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించాలని రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగులో నిర్మించిన 192 ఇండ్లను శనివారం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నగరం, అర్బన్ మండలంలో ఇప్పటివరకు 2,500 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి లబ్ధిదారులకు అప్పగించామని తెలిపారు.



ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగులో డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభిస్తున్న రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్. చిత్రంలో కలెక్టర్ వీపీ గౌతమ్



లీగల్ మాడ్యూల్ క్యాంప్‌లో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషి

## అందరికీ న్యాయసేవలు అందాలి

- హైకోర్టు న్యాయమూర్తి సామ్‌కోషి

నిజామాబాద్ లీగల్/కామారెడ్డి, అక్టోబర్ 7: సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు అందాల్సిన అవసరం ఉన్నదని తెలంగాణ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్‌కోషి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ కలెక్టరేట్, కామారెడ్డి కోర్టు హాలులో వేర్వేరుగా నిర్వహించిన 'లీగల్ మాడ్యూల్ క్యాంప్' సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయసేవలు అందక ఎవరూ నష్టపోరాదనే లక్ష్యంతో డిఫెన్స్ లీగల్ ఎయిడ్ సిస్టమ్‌కు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లను స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయిస్తామని చెప్పారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమలత మాట్లాడుతూ.. పరిమితిలో ప్రభుత్వ, న్యాయ వ్యవస్థల ఆర్థిక, న్యాయ సహాయాలు ఉంటాయని, వాటిని ఉపయోగించుకుని స్వతహాగా ఎదగాలని సూచించారు. నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ, జితేశ్ వీ పాటిల్, సీపీ సత్యనారాయణ, ఎస్పీ శ్రీనివాస రెడ్డి, జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు.



కురవి మండలం పెద్దతండా స్కూల్‌లో చీరల పంపిణీ కార్యక్రమంలో భావోద్వేగానికిగురై కంట తడిపెడుతున్న మంత్రి సత్యవతి. చిత్రంలో ఎంపీ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ బిందు

## బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- మంత్రి సత్యవతి రాథోడ్ ధీమా
- తల్లిదండ్రులను తలచుకుని మంత్రి భావోద్వేగం

గార్ల/కురవి, అక్టోబర్ 7: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతున్న అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదం బీఆర్ఎస్‌కే ఉంటుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో రాంపురం పాకాల యేటిపై రూ.15 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఇల్లందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందుతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ.. బ్రిడ్జి నిర్మాణంతో ఇక్కడి ప్రజల చిరకాల కల నెరవేరనున్నదని చెప్పారు. అభివృద్ధి సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉన్నదని తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మూడోసారి వందకుపైగా సీట్లు గెలిచి.. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి తన సొంతూరు మహబూబాబాద్ జిల్లా కురవి మండలం పెద్దతండాలో రూ.25 కోట్లతో అభివృద్ధి పనులను ఎంపీ మాలోత్ కవిత, కలెక్టర్ శశాంక్‌లతో కలిసి ప్రారంభించారు. బతుకమ్మ చీరల పంపిణీ సందర్భంగా తన తల్లిదండ్రులను గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. 'తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే.. రాజకీయ జన్మనిచ్చింది సీఎం కేసీఆర్. పెద్దతండాలో పుట్టిన నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను. పెద్దతండా అభివృద్ధి చెందే సమయానికి నా తల్లిదండ్రులిద్దరూ లేరు. సీఎం కేసీఆర్ దయతో నా నాన్న కోరికను నెరవేర్చా'ను అని గుర్తుచేసుకుంటూ సభావేదికపైనే బోరున విలపించారు.